సాక్షి
నిజామాబాద్
శనివారం । 12 । ఏప్రిల్ । 2025



ముందస్తుగానే లారీలు

కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన ధాన్యాన్ని తరలించేందుకు అధికారులు ముందస్తుగా లారీలు ఏర్పాటు చేస్తున్నారు.

- 10లో ▸



అడుగులన్నీ కొండగట్టు వైపే..

హనుమాన్ మాలధారుల అడుగులన్నీ కొండగట్టు వైపే పడుతున్నాయి. హనుమాన్ జయంతి సందర్భంగా భక్తులు తరలివెళ్తున్నారు.

-10లో ▸

గరిష్టం/కనిష్టం
40.6 /19.9

వాతావరణం

ఉదయం ఈదురుగాలులు వీస్తాయి. పగటి ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశాలున్నాయి. ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

సెక్స్ వర్కర్లకు లేబర్ కార్డులు

నిజామాబాద్ నాగారం: నగరంలోని 13 మంది మహిళా సెక్స్ వర్కర్లకు కోర్టు ఆవరణలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల శుక్రవారం లేబర్‌కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లేబర్ ఆఫీసర్ యోహాన్, స్నేహ సొసైటీ కార్యదర్శి ఎస్ సిద్దయ్య, ప్రత్యేక పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్ జ్యోతి, మానసిక దివ్యాంగుల పాఠశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరి, కోఆర్డినేటర్ డాక్టర్ కిరణ్మయి, స్నేహ టీఐ ప్రాజెక్టు మేనేజర్ బాలరాజు, జీఎస్ఎం మౌనిక, కౌన్సిలర్ అన్విత తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషిచేయాలి

- సీపీ సాయి చైతన్యను కలిసిన ఎంపీ అర్వింద్



సుభాష్‌నగర్: జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు పోలీస్ యంత్రాంగం కృషిచేయాలని ఎంపీ అర్వింద్ ధర్మపురి సూచించారు. ఇటీవల సీపీగా బాధ్యతలు స్వీకరించిన సాయి చైతన్యను శుక్రవారం అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ పటేల్ కులాచారితో కలిసి ఎంపీ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీపీకి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో మత్తు పదార్థాలు, గంజాయి అక్రమ రవాణాను ఉక్కుపాదంతో అణచివేస్తున్న సీపీకి ధన్యవాదాలు తెలిపారు. బీజేపీ నాయకులపై అక్రమ కేసులు పెట్టొద్దని, నిష్పక్షపాతంగా వ్యవహరించాలని ఎంపీ సూచించారు.

నేడు వైన్ షాపులు బంద్

ఖలీల్‌వాడి: నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని వైన్స్‌లు, కల్లు దుకాణాలు, బార్లు శనివారం ఉదయం 6 నుంచి ఆదివారం ఉదయం 6 గంటల వరకు మూసి ఉంటాయని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమాన్ జయంతి సందర్భంగా మూసివేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎవరైనా షాపులు తెరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

భూగర్భ జలాల వృద్ధికి ప్రత్యేక కార్యాచరణ



వర్ని: రాష్ట్రంలో భూగర్భ జలాలు పెంపొందించేందుకు వాటర్‌షెడ్ యాత్ర పథకం ద్వారా ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు కేంద్ర భూగర్భ జలశాఖ అడిషనల్ కమిషనర్ సీపీ రెడ్డి వెల్లడించారు. వర్ని మండలంలోని జాకోరా గ్రామంలో వాటర్‌షెడ్ యాత్ర కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. అంతకుముందు గ్రామంలో బోనాలతో ర్యాలీ నిర్వహించి వాటర్ షెడ్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంకుడు గుంతలు, చెక్‌డ్యాములు, ఊట కుంటలు, అడవుల్లో రాతి కట్టలను నిర్మించి వర్షపు నీటిని నిలువ చేయడంతో భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. ప్రజల భాగస్వామ్యంతో పథకాన్ని విజయవంతంగా అమలు చేసేందుకు జాకోరాకు రూ.2 కోట్లు విడుదల చేశామన్నారు. ప్రజలు ఇంటివద్ద, పొలాలు, అటవీ ప్రాంతాల్లో నీటి నిల్వకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక అధికారి షఫీ ఉల్లా, రాష్ట్ర వాటర్ షెడ్ జాయింట్ కమిషనర్ నర్సింలు, అదనపు కలెక్టర్ అంకిత్, డీఆర్డీవో సాయాగౌడ్, జాకోరా సహకార సంఘం అధ్యక్షుడు దశరథ్, తహసీల్దార్ సాయిలు, ఎంపీడీవో వెంకటేశ్ పాల్గొన్నారు.

సాక్షి చర్చాగోష్ఠితోనే నాంది పలకాలి



తెలంగాణ వర్సిటీలో జరిగే అవినీతి, అక్రమాలను వెలికితీయడంలో 'సాక్షి' కృషి అభినందనీయం. బీఆర్ఎస్ హయాంలోనే జిల్లాలో ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటుకు అనేక ప్రయత్నాలు జరిగాయి. కళాశాల మంజూరు ఉత్తర్వులు వచ్చే సమయంలోనే ఎన్నికల కోడ్ రావడంతో నిలిచిపోయింది. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం జిల్లాపై వివక్ష చూపుతోంది. గతంలో పార్టీలకతీతంగా వర్సిటీ ఏర్పాటు కోసం ఎలా అయితే పోరాడామో, ఇప్పుడు తెయూలో ఇంజినీరింగ్ కాలేజీ ఏర్పాటయ్యేంత వరకు కలిసికట్టుగా పోరాటాలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇందుకు 'సాక్షి' చర్చాగోష్ఠితోనే నాంది పలకాలి. – శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు

ప్రభుత్వం సుముఖంగా ఉంది..



తెయూలో ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటుకు కాంగ్రెస్ ప్రభుత్వం సుముఖంగా ఉంది. ఇటీవలే నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి ఈ విషయమై సీఎం రేవంత్‌రెడ్డిని కలువగా ఆయన సానుకూలంగా స్పందించారు. త్వరలోనే వర్సిటీలో ఇంజినీరింగ్ కాలేజీ ఏర్పాటయ్యే అవకాశం ఉంది. జిల్లా విద్యార్థులకు సాంకేతిక విద్య అందుబాటులోకి వస్తుంది.

– పంచరెడ్డి చరణ్, తెయూ పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు

జిల్లా ప్రజాప్రతినిధులకు చిత్తశుద్ధి లేదు..



ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు విషయమై జిల్లా ప్రజాప్రతినిధులకు చిత్తశుద్ధి లేదు. చిన్నచిన్న జిల్లాలకు ఇంజినీరింగ్ కళాశాలలు మంజూరయ్యాయి. వసతి, సౌకర్యాలపరంగా అన్ని విధాలా అనుకూలంగా ఉన్న నిజామాబాద్ జిల్లాలో ఇప్పటి వరకు ఇంజినీరింగ్ కాలేజీ లేకపోవడం దురదృష్టకరం. ఇంజినీరింగ్ కాలేజ్ ఏర్పాటుపై అసెంబ్లీలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ ఒక్కరే మాట్లాడారు. ఉమ్మడి జిల్లాకు చెందిన అధికార పార్టీ ఎమ్మెల్యేలు ఎవరూ మాట్లాడిన పాపాన పోలేదు. ఇంజినీరింగ్ కాలేజీ విషయంలో ఐక్యంగా పోరాడాలి.

– పిల్లి శ్రీకాంత్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు

కలిసికట్టుగా పోరాటం

తెయూలో ఇంజినీరింగ్ కాలేజీ ఏర్పాటు చేయాల్సిందే

- విద్యార్థి సంఘాలు, పూర్వ విద్యార్థుల డిమాండ్
- త్వరలో కార్యాచరణ
- 'సాక్షి' చర్చాగోష్ఠిలో ముక్తకంఠంతో వెల్లడి

సాక్షి చర్చాగోష్ఠి



సాక్షి ఆధ్వర్యంలో నిర్వహించిన చర్చాగోష్ఠిలో పాల్గొన్న విద్యార్థి సంఘాల నాయకులు, పూర్వ విద్యార్థులు

తెయూ(డిచ్‌పల్లి)/నిజామాబాద్ అర్బన్: తెలంగాణ విశ్వవిద్యాలయంలో ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు చేయాల్సిందేనని విద్యార్థి సంఘాల నాయకులు, పూర్వ విద్యార్థులు ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. తెయూలో ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు చేయాలని కోరుతూ శుక్రవారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో 'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహించిన చర్చాగోష్ఠిలో వివిధ విద్యార్థి సంఘాల నాయకులు, వర్సిటీ పూర్వ విద్యార్థులు పాల్గొని తమ అభిప్రాయాలు పంచుకున్నారు. తెలంగాణ ఏర్పాటుకు ముందే ఎన్నో పోరాటాలు, ఉద్యమాలు చేసి యూనివర్సిటీ సాధించుకున్నామని పేర్కొన్నారు. జిల్లా ప్రజలు, విద్యార్థుల మనోభావాలను గుర్తించి దివంగత సీఎం, మహానేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి రాష్ట్రం పేరుతో తెలంగాణ యూనివర్సిటీ మంజూరు చేశారని గుర్తుచేశారు. రాష్ట్రంలోనే ఓయూ, కేయూ తర్వాత మూడో అతిపెద్ద యూనివర్సిటీ తెయూ అని, 577 ఎకరాల సువిశాల ప్రాంగణం వర్సిటీ సొంతమన్నారు. తెయూ ఏర్పడి 18ఏళ్లు గడిచినా జిల్లా ప్రజాప్రతినిధుల అసమర్థతతోనే ఇంతవరకు ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు కాలేదని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు అంశాన్ని ఓట్ల కోసం రాజకీయ పార్టీలు వాడుకుంటున్నాయని అన్నారు. వర్సిటీలో ఇంజినీరింగ్ కాలేజీ ఏర్పాటు చేసే వరకు విద్యార్థి సంఘాలన్నీ జేఏసీగా ఏర్పడి కలసికట్టుగా పోరాడాలని, త్వరలోనే కార్యాచరణ రూపొందించుకోవాలని నిర్ణయించారు.

జేఏసీగా ఏర్పడాలి



తెయూలో ఇంజినీరింగ్ కాలేజీ ఏర్పాటయ్యేంతవరకు అన్ని విద్యార్థి సంఘాలు జేఏసీగా ఏర్పడి కలిసికట్టుగా పోరాడాలి. తెయూ అధికారులకు అక్రమాలపై ఉన్న శ్రద్ధ వర్సిటీ భూములను కాపాడుకోవడంపై లేదు. ఇప్పటికే 57 ఎకరాల భూమి అన్యాక్రాంతం అయింది. అధికార పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు వర్సిటీ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలి.

– యెండల ప్రదీప్, తెయూ పూర్వ విద్యార్థి

పోరాటానికి సహకరిస్తాం..



ఇంజినీరింగ్ కాలేజీ ఏర్పాటు కోసం విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో జరిపే పోరాటాలకు పూర్వ విద్యార్థులుగా మావంతు సహకారం అందజేస్తాం. విద్యార్థుల చేతుల్లోనే వర్సిటీ భవిష్యత్ ఆధారపడి ఉంది. ఇంజినీరింగ్ కాలేజీ వస్తే గ్రామీణ ప్రాంత విద్యార్థులకు సాంకేతిక విద్య అందుబాటులోకి వస్తుంది. కాలేజీ ఏర్పాటుకు అవసరమైన సువిశాల స్థలం, ఫ్యాకల్టీ ఇప్పటికే అందుబాటులో ఉన్నారు. – పుప్పాల రవి, తెయూ రీసెర్చ్ స్కాలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు

నూతన ఆవిష్కరణలకు అవకాశం



ఇంజినీరింగ్ కాలేజీ ఏర్పాటుతో విద్యార్థులు నూతన ఆవిష్కరణలు చేసే అవకాశం కలుగుతుంది. ప్రస్తుతం ఇంజినీరింగ్ కాలేజీ లేకపోవడంతో గ్రామీణ ప్రాంత విద్యార్థులు హైదరాబాద్‌కు వెళ్లి చదువుకోవాల్సి వస్తోంది. దీంతో పేద విద్యార్థులపై లక్షల రూపాయల ఆర్థిక భారం పడుతోంది. ఎన్నికలకు ముందు ఇంజినీరింగ్ కాలేజీ ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టించుకోకపోవడం శోచనీయం.

– శివ, ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యులు

ఒకే ఎజెండాతో పోరాడాలి



రాజకీయ అనుబంధ సంఘాలు, విద్యార్థి సంఘాల నాయకులు పార్టీల జెండాలు పక్కన పెట్టి ఒకటే ఎజెండాతో ఉద్యమించాలి. వర్సిటీలో ఇంజినీరింగ్ కాలేజీ సాధించే వరకు జేఏసీగా ఏర్పడి పోరాడాలి. యంగ్ ఇండియా పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం ఏఐ కోర్సులు, సాంకేతిక విద్యకు అధిక ప్రాధాన్యతనిస్తోంది. అయితే జిల్లాకు ఇంజినీరింగ్ కాలేజీ మంజూరు చేయడంలో తీవ్ర వివక్ష చూపుతోంది. అన్నివర్గాల ప్రజలు, మేధావులు, విద్యావంతులు, విద్యార్థులు ఒకే ఎజెండాతో పోరాడాలి.

– రమావత్ లాల్‌సింగ్, తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్

విద్యకు దూరమవుతున్నారు



తెయూలో ఇంజినీరింగ్ కాలేజీ లేకపోవడవంతో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాతోపాటు ఆదిలాబాద్ జిల్లాకు చెందిన ఎంతో మంది గ్రామీణ ప్రాంత విద్యార్థులు సాంకేతిక విద్యకు దూరమవుతున్నారు. సాక్షాత్తు సీఎం రేవంత్‌రెడ్డి రెండుసార్లు హామీ ఇచ్చినా జిల్లాకు ఇంజినీరింగ్ కాలేజీ మంజూరు కాకపోవడం జిల్లా ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యమే. మంత్రి పదవుల్లో ఉన్నవారు తమ జిల్లాలకు ఇంజినీరింగ్ కాలేజీలు తెచ్చుకుంటున్నారు. జిల్లాకు మంత్రి పదవి లేకపోవడంతో ఈ విషయమై పట్టించుకునే వారు కరువయ్యారు.

– జే రాజేశ్వర్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు

విద్యార్థులను పట్టించుకోవడం లేదు



కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులను ఏమాత్రం పట్టించుకోవడం లేదు. గతంలో జిల్లా నుంచి మంత్రులుగా పనిచేసిన వారు తెయూ అభివృద్ధిని పట్టించుకోలేదు. ఇప్పుడు మంత్రి లేక వర్సిటీపై, జిల్లాపై వివక్ష చూపుతున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు పేరుకుపోవడంతో ప్రైవేటు కళాశాలలు మూతపడే స్థితికి చేరుకున్నాయి. సీఎం రేవంత్‌రెడ్డి ఆర్మూర్‌లో ఇచ్చిన హామీని నిలబెట్టుకుని ఇంజినీరింగ్ కాలేజీని మంజూరు చేయాలి.

– కల్యాణ్, టీజీవీపీ జిల్లా అధ్యక్షుడు

ప్రైవేటుకే అనుమతులు



ప్రభుత్వాలు మారుతున్నాయి కానీ విద్యార్థుల తలరాత మారడం లేదు. ప్రైవేట్ యూనివర్సిటీలు, ఇంజినీరింగ్ కాలేజీలకు విచ్చలవిడి అనుమతులు ఇస్తున్న ప్రభుత్వం.. ప్రభుత్వ యూనివర్సిటీల అభివృద్ధి, ఇంజినీరింగ్ కళాశాలల ఏర్పాటుపై చిత్తశుద్ధి చూపడం లేదు. తెయూలో ఇంజినీరింగ్ కాలేజీ ఏర్పాటుకు 'సాక్షి' తీసుకుంటున్న చొరవ అభినందనీయం. ప్రజాప్రతినిధులు స్పందించి కాలేజీ ఏర్పాటుకు కృషి చేయాలి.

– ప్రిన్స్, పీడీఎస్‌యూ నగర కార్యదర్శి

శోభాయాత్రకు సర్వం సిద్ధం

- నేడు ఇందూరులో హనుమాన్ జయంతి ర్యాలీ
- రెండు లక్షల మంది భక్తులు పాల్గొనే అవకాశం
- పోలీసుల భారీ బందోబస్తు



ఖలీల్‌వాడి: హనుమాన్ జయంతి వేడుకలకు సర్వం సిద్ధమయ్యింది. ఏటా నిర్వహించే భారీ శోభాయాత్రకు ఇందూరు నగరం ముస్తాబైంది. బజరంగ్‌దళ్, హిందూవాహిని ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. శనివారం ఉదయం 10 గంటలకు కంఠేశ్వర్ నుంచి ప్రారంభమయ్యే శోభాయాత్ర రాత్రి 10 గంటలకు ఆర్ఆర్ చౌరస్తాకు చేరుకుంటుంది. రాష్ట్రంలోనే ప్రసిద్ధి చెందిన హనుమాన్ శోభాయాత్రకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరానున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ర్యాలీకి ట్రాఫిక్ ఇబ్బందులు కలుగకుండా దారిమళ్లింపు చేపట్టారు.

శోభాయాత్రకు 15 ఏళ్లు..

నగరంలో హనుమాన్ జయంతి శోభాయాత్రను 2009లో ప్రారంభించారు. మొదట 25 మంది మాత్రమే ర్యాలీలో పాల్గొనగా, ఏటా పెరుగుతూ వస్తోంది. గతేడాది 1.50 లక్షల మంది భక్తులు హనుమాన్ శోభాయాత్రలో పాల్గొన్నారు. ఈసారి 2 లక్షలకు పైగా భక్తులు హాజరయ్యే అవకాశం ఉన్నట్లు సంస్థలు అంచనా వేస్తున్నాయి.

1300 మంది పోలీసులతో బందోబస్తు

నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్లలో శనివారం నిర్వహించే హనుమాన్ జయంతి, శోభాయాత్ర, అన్నదాన కార్యక్రమాలు శాంతియుతంగా నిర్వహించాలని సీపీ సాయి చైతన్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 1300 మంది సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. నగరంలో జరిగే హనుమాన్ శోభాయాత్రను సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాలు, బైనాక్యులర్లతో పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. పుకార్లను నమ్మొద్దని పోలీసులకు సహకరించాలని పేర్కొన్నారు.

రజతోత్సవ సభను విజయవంతం చేయాలి

- కాంగ్రెస్ హామీల అమలుపై పోరాడతాం
- బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్



మాట్లాడుతున్న బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, హామీలన్నీ అమలు చేయాలనే డిమాండ్‌తో ఏడాదిపాటు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ నెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తి వద్ద నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభ నుంచే కాంగ్రెస్ ప్రభుత్వ హామీల అమలుపై బీఆర్ఎస్ పోరాటం ప్రారంభమవుతుందన్నారు. డిచ్‌పల్లి మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిజామాబాద్ రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి మాట్లాడారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ వంద రోజుల్లో అమలు చేస్తామని చెప్పిన హామీలు, 15 నెలలు గడిచినా అమలు చేయలేకపోయిందని ఎద్దేవా చేశారు. కేసీఆర్ హయాంలో ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందాయని, నిరంతర విద్యుత్, సాగు, తాగునీటికి ఇబ్బందుల్లేకుండా పాలన సాగిందని, దేశానికే తెలంగాణ ఆదర్శంగా నిలిచిందన్నారు. కాంగ్రెస్ మోసాలపై బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు ప్రజలను చైతన్యపరచాలని సూచించారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభకు పెద్ద సంఖ్యలో తరలివెళ్లి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ధర్పల్లి మాజీ జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్, డీసీసీబీ డైరెక్టర్ శేఖర్‌రెడ్డి, మండల నాయకులు శక్కరికొండ కృష్ణ, నల్లవెల్లి సాయిలు, ఒడ్డెం నర్సయ్య, నీరడి పద్మారావు, రమేశ్ నాయక్, హన్మంత్‌రెడ్డి, ధీకొండ శ్రీనివాస్, మొచ్చ శీను, ముత్యం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

15న డిచ్‌పల్లిలో సన్నాహక సభ

బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయడంలో భాగంగా ఈ నెల 15న డిచ్‌పల్లి మండల కేంద్రంలో సన్నాహక సభ నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ తెలిపారు. సభకు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవన్‌రెడ్డి హాజరవుతారని వివరించారు.

సమానత్వమే పూలే అభిమతం

- సాంఘిక బహిష్కరణలు విధించే వీడీసీలపై కఠిన చర్యలు
- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు
- ఘనంగా జ్యోతీబాపూలే జయంతి



మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

నిజామాబాద్ అర్బన్: అన్నివర్గాల సమానత్వమే మహాత్మా జ్యోతీబాపూలే అభిమతమని, ఆ దిశగా తుది వరకు తన కృషి కొనసాగించారని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు కొనియాడారు. జ్యోతీబాపూలే జయంతి వేడుకల్లో భాగంగా జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో న్యూ అంబేడ్కర్ భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన ఉత్సవాలకు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక రుగ్మతలను, దురాచారాలను పారద్రోలేందుకు అవిశ్రాంతంగా కృషి చేసిన మహనీయుడు జ్యోతీబాపూలే అని అన్నారు. పూలే ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

వీడీసీలపై ఫిర్యాదులొస్తున్నాయి

జిల్లాలోని పలు ప్రాంతాల్లో గ్రామాభివృద్ధి కమిటీ (వీడీసీ)ల పేరిట సాంఘిక బహిష్కరణలు విధిస్తున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయని, అలాంటి వీడీసీలపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. రాష్ట్ర ఖనిజ అభివృద్ధి సంస్థ చైర్మన్ అనిల్ ఈరవత్రి, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్ మాట్లాడుతూ పూలే ఆశయాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం బడుగు, బలహీనవర్గాల సంక్షేమానికి పాటుపడుతోందన్నారు. అంతకుముందు వినాయక్‌నగర్‌లోని పూలే విగ్రహానికి అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, బీసీ సంఘాల ప్రతినిధులు, అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, జిల్లా బీసీ అభివృద్ధి శాఖ అధికారిణి స్రవంతి, సహాయ అధికారి నర్సయ్య, వివిధ సంఘాల ప్రతినిధులు గైని గంగారాం, బుస్స ఆంజనేయులు, నరాల సుధాకర్, వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

- ఏడుగురు సభ్యుల మహారాష్ట్రకు చెందిన పార్థి గ్యాంగ్
- జాతీయ రహదారిపై దారిదోపిడీలు
- వివరాలు వెల్లడించిన కామారెడ్డి ఎస్పీ రాజేష్ చంద్ర



అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రాజేష్ చంద్ర

కామారెడ్డి క్రైం: ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని జాతీయ రహదారి 44 వెంబడి ఆగి ఉన్న వాహనాలను టార్గెట్ చేస్తూ దారి దోపిడీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠా (పార్థి గ్యాంగ్)ను కామారెడ్డి పోలీసులు పట్టుకుని రిమాండ్‌కు తరలించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఎస్పీ రాజేష్ చంద్ర వివరాలు వెల్లడించారు. నెల రోజుల వ్యవధిలో కామారెడ్డి జిల్లాలోని సదాశివనగర్, దేవునిపల్లి పీఎస్‌ల పరిధిలో రెండు దారి దోపిడీ ఘటనలు వెలుగు చూశాయి. వాటిలో ఒకటి ఈ నెల 2 న టేక్రియాల్ వద్ద జరిగింది. ఆదిలాబాద్‌కు చెందిన ఓ వ్యాపారి తన కుమారుడిని హైదరాబాద్‌లోని హాస్టల్ నుంచి కారులో ఇంటికి తీసుకుని వస్తూ తెల్లవారు జామున టేక్రియాల్ సమీపంలోని దాబా వద్ద రోడ్డు పక్కన కారు నిలిపి విశ్రాంతి తీసుకుంటున్నారు. గమనించిన దుండగులు కారు అద్దాలు పగులగొట్టి కత్తులతో బెదిరించి ల్యాప్‌టాప్, మరో బ్యాగును ఎత్తుకెళ్లారు. కేసు నమోదు చేసి విచారణ జరుపగా ఇలాంటి ఘటనలు ఎన్‌హెచ్–44 వెంబడి తరచుగా జరుగుతున్నట్లు పోలీసులు గుర్తించారు. నిందితులను పట్టుకునేందుకు ఆరు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి విచారణ ముమ్మరం చేసినట్లు ఎస్పీ తెలిపారు.

పంక్చర్ షాప్ యజమాని ఇచ్చిన క్లూతో..

మహారాష్ట్ర లోని వార్ధా జిల్లాకు చెందిన కులీ కిషన్ పవార్, జాకీ గుజ్జు భోంస్లే, పవార్ హరీష్, అతని భార్య హౌరా పవార్, అనురాగ్ రత్నప్ప భోంస్లే, అతని భార్య అంచనా భోంస్లే, చూడీ లను ప్రస్తుతం పోలీసులు అరెస్ట్ చేశారు. చిరంజీవి, గుండా, సాంబ భోంస్లే, బంగారు భోంస్లేలు పరారీలో ఉన్నారు. వీరంతా వార్ధా జిల్లాలోని ఓలాంనగర్, సముద్రాపూర్, శివగ్రాం గ్రామాలకు చెందిన వారు. వారంతా ముఠాగా ఏర్పడి దారి దోపిడీలకు పాల్పడుతున్నారు. పంక్చర్ షాప్ యజమాని ఇచ్చిన క్లూతో నిందితులను గుర్తించడం సాధ్యమయిందని ఎస్పీ తెలిపారు. టేక్రియాల్ వద్ద దుకాణం నడుపుతున్న షకీల్ పోలీసులకు యేడాది క్రితం జరిగిన ఓ దారి దోపిడీ ఘటనను వివరించి బాధితుడి అడ్రస్ ఇచ్చాడు. అతని ద్వారా నిందితుల ఆనవాళ్లు తెలుసుకున్నామని తెలిపారు. కేసు ఛేదనలో చాకచక్యంగా వ్యవహరించిన ఏఎస్పీ చైతన్య రెడ్డి, సీఐలు శ్రీనివాస్, రామన్, సంతోష్ కుమార్, ఎస్సైలు రాజు, రంజిత్, ఉస్మాన్, సిబ్బంది రవి కిరణ్, రవి లను ఎస్పీ అభినందించారు.

క్లుప్తంగా

ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం



పెర్కిట్(ఆర్మూర్): అనేక సంవత్సరాలుగా గల్ఫ్ కార్మికులు ఎదురుచూస్తున్న ఎన్ఆర్ఐ పాలసీ కోసం రాష్ట్ర ప్రభుత్వం నియమించిన సలహా కమిటీ ఏర్పాటు నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని ప్రవాస భారతీయుల హక్కులు, సంక్షేమ వేదిక వ్యవస్థాపకుడు కోటపాటి నర్సింహ నాయుడు అన్నారు. మామిడిపల్లిలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ప్రభుత్వం నియమించిన సలహా కమిటీలో గల్ఫ్ కార్మికుల కష్టాలు తెలిసిన నిపుణులను చేర్చుకుంటే బాగుండేదన్నారు. అలాగే గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలన్నారు. న్యాయ సలహాదారుడు బాలయ్య పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా ఆస్పత్రులకు రూ.85కోట్ల నిధులు

నిజామాబాద్ నాగారం: నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రులకు రూ.85కోట్ల నిధులు మంజూరు అయినట్లు ప్రభుత్వ సలహాదారు షబ్బీర్అలీ ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్లోని సెక్రటేరియట్లో శుక్రవారం రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనరసింహ అధ్యక్షతన జరిగిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్అలీ హాజరయ్యారు. ఈసందర్భంగా నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రుల సమస్యలు, అభివృద్ధి కోసం మంత్రిని షబ్బీర్ అలీ విన్నవించి, నిధులు మంజూరు చేసేలా కృషి చేశారు. జిల్లాలో ఆస్పత్రి మౌలిక సదుపాయాలు, సిబ్బంది ఇతర నిత్యావసర అవసరాల కోసం మొత్తం రూ.63 కోట్లు మంజూరు చేశారు. సివిల్ పనులు, పరికరాల కోసం రూ. 22 కోట్లు మంజూరు చేశారు. కొత్తగా మంజూరైన అభివృద్ధి పనులను శంకుస్థాపన చేసేందుకు ఆరోగ్య మంత్రి త్వరలో జిల్లాను సందర్శిస్తారని షబ్బీర్అలీ పేర్కొన్నారు. సమావేశంలో ఉమ్మడి జిల్లా వైద్యశాఖ అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వచనాలయ అభివృద్ధికి సహకరించాలి



నిజామాబాద్ అర్బన్: నగరంలోని బాపూజీ వచనాలయం అభివృద్ధికి సహకరించాలని వచనాలయం కమిటీ ప్రతినిధులు కోరారు. బాపూజీ వచనాలయం కమిటీలో నూతనంగా సలహాదారులు, కోఆప్షన్ సభ్యుల నియామకం చేపట్టగా శుక్రవారం వారికి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా కమిటీ అధ్యక్షుడు భక్తవత్సలం మాట్లాడుతూ.. బాపూజీ వచనాలయాన్ని డిజిటల్ మాధ్యమంలోకి తీసుకెళ్లే ప్రణాళికను రూపొందించినట్లు తెలిపారు. ఇకపై పుస్తకాలతో పాటు డిజిటల్ చదువుకు కూడా ఇది అనుకూలంగా ఉంటుందన్నారు. ఇందుకోసం సభ్యులు, సలహాదారులు, కోప్షన్ సభ్యులు ఆలోచనలు, సూచనలు అందించాలని కోరారు. అనంతరం నూతన సలహాదారులు తాహెర్ బిన్ హందన్, గడుగు గంగాధర్, కేశవేణు, శేఖర్ గౌడ్, దినేష్ రెడ్డి, ప్రకాష్ రెడ్డి, ధర్మపురి సురేందర్, కోప్షన్ సభ్యులుగా బంటు రాజేశ్వర్, మాస్టర్ శంకర్, శ్రీహరి ఆచార్య, మెగా సుబేధర్, సాయిబాబా గౌడ్ను సన్మానించారు. ప్రధాన కార్యదర్శి మీసాల సుధాకర్, కోశాధికారి గంగాధర్రావు, ఉపాధ్యక్షుడు దాస్, సంయుక్త కార్యదర్శి సాంబయ్య, దత్తాత్రి, సభ్యులు పాల్గొన్నారు.



ఆర్మూర్ పరిధిలోని పెర్కిట్ నుంచి కొండగట్టుకు పాదయాత్రగా బయల్దేరిన హనుమాన్ భక్తులు

అడుగులన్నీ కొండగట్టు వైపే..

- జిల్లావ్యాప్తంగా పాదయాత్రగా వెళుతున్న హనుమాన్ భక్తులు
- హనుమాన్ జయంతి రోజున అంజన్న దర్శనం కోసమే..

ఆర్మూర్: హనుమాన్ మాలధారులు, భక్తుల అడుగులన్నీ కొండగట్టు వైపే వేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా వందల సంఖ్యలో భక్తులు ఇటీవల పాదయాత్రగా వెళ్లగా ఈ నెల 12న హనుమాన్ జయంతి పురస్కరించుకొని స్వామివారి దర్శనం చేసుకోనున్నట్లు వారు తెలిపారు. జై శ్రీరాం.. జై హనుమాన్ అంటూ గుంపులుగా పాదయాత్రగా వెళ్లడం ద్వారా అంజన్న కరుణ తమపై ఉంటుందన్నది భక్తుల నమ్మకం.

జిల్లా కేంద్రం నుంచి 113కి.మీ.

జిల్లా కేంద్రం నుంచి కొండగట్టు 113 కిలో మీటర్ల దూరం రాగా.. ఆర్మూర్ పట్టణం పెర్కిట్ నుంచి 85 కిలో మీటర్ల దూరంలో ఉంది. జిల్లాలోని నలుమూలల నుంచి హనుమాన్ మాలధారణ చేసిన భక్తులతో పాటు మాలధారణ చేయని భక్తులు సైతం తమ మొక్కలు తీర్చుకోవడానికి కొండగట్టుకు పాదయాత్రగా వెళ్లడం ప్రారంభించారు. అలాగే దీక్ష విరమణ కోసం ఎక్కువగా కొండగట్టుకు వెళ్తుంటారు. జిల్లా నుంచి భక్తుల పాదయాత్ర సుమారు మూడు నుంచి నాలుగు రోజుల వరకు సాగనుంది. పాదయాత్ర విడతల వారిగా చేపడతారు. సాయంత్రం నుంచి రాత్రి వరకు పాదయాత్ర నిర్వహిస్తారు. విశ్రాంతి తర్వాత వేకువజామున ప్రారంభించి ఉదయం 10గం.వరకు చేపడతారు. అనంతరం సాయంత్రం వరకు విశ్రాంతి తీసుకుంటారు. పాదయాత్రలో భక్తులు కొందరు ఒక పూట మాత్రమే భోజనం చేస్తారు. మరికొందరు పండ్లు, పాలు మాత్రమే తీసుకుంటారు. మండుటెండలో వేసవి తాపాన్ని భరిస్తూ 63వ నెంబర్ జాతీయ రహదారి పొడవునా భక్తులు పాదయాత్రను కొనసాగిస్తున్నారు.

మహిమాన్విత పుణ్యక్షేత్రం..

జగిత్యాల జిల్లా మల్యాల మండలం ముత్యంపేట గ్రామానికి దగ్గరలో కొండగట్టు పుణ్యక్షేత్రం ఉంది. వందల ఏళ్ల నుంచి ఇక్కడ హనుమంతుడిని కొలుస్తుంటారు. ఇక్కడ స్వయంభువుగా హనుమంతుడు వెలిశాడని చెబుతుంటారు. అంజనీపుత్రుడు సంజీవని పర్వతం చేతుల్లో పట్టుకుని గాల్లో వస్తుంటే, ముత్యంపేట దగ్గరలో ఓ ముక్క పడిందని ఇక్కడ ఓ కథ ప్రసిద్ధి. ఆ భాగాన్నే కొండగట్టుగా పర్వత భాగంగా చెబుతుంటారు. ఇక్కడి కొండల్లో ఎన్నో ఔషధ మొక్కలు కూడా ఉన్నాయి. కోతుల దండు కూడా ఎక్కువగానే ఉంటుంది.

2017 నుంచి..

ఆర్మూర్ పట్టణం పెర్కిట్ శివారులోని హనుమాన్ మందిరం నుంచి హనుమాన్ భక్తులు 2017 నుంచి పాదయాత్రగా కొండగట్టుకు వెళ్లడం ప్రారంభించారు. కోవిడ్ కారణంగా రెండు సంవత్సరాలు వీరికి అనుమతి లభించకపోవడంతో ఈ పర్యాయం ఏడోసారి కాలినడకన కొండగట్టు అంజన్నను చేరడానికి పాదయాత్రగా బయల్దేరారు. బుధవారం వారు పాదయాత్ర చేపట్టగా నేడు కొండగట్టు చేరుకోనున్నారు. మాల ధారణ చేయకుండా మండల దీక్ష, అర్ధ మండల దీక్ష, 11 రోజుల దీక్షను నిష్ఠతో పూర్తి చేసుకొని సుమారు 20 మందితో కూడిన భక్త బృందం ప్రతీ ఏటా పాదయాత్రగా వెళ్లి అంజన్న దర్శనం చేసుకుంటున్నారు.



అంతా కాషాయమయం

63వ నంబర్ జాతీయ రహదారి పొడవునా భక్తులు కాషాయ జెండాలు పట్టుకొని నడుస్తుండటంతో రహదారి మొత్తం కాషాయ వర్ణమే కనబడుతుంది. జై శ్రీరాం, జై హనుమాన్ నినాదాలతో భక్తుల గుండెల్లో ఉత్సాహం మరింత పొంగి పొర్లుతుంది.

– విశకోల రాజేష్, ఆర్మూర్



అలసట అనిపించదు..

హనుమంతుడికి ప్రీతిపాత్రమైన శ్రీరామ నామ స్మరణనే మా పాదయాత్ర అలసటను తీరుస్తోంది. జై శ్రీరాం, జై హనుమాన్ అంటూ జాతీయ రహదారి పొడవునా హనుమాన్ భక్తులు పాదయాత్రగా వెళ్లడం చూసే వారికి సైతం భక్తి భావాన్ని మరింత పెంచుతుంది.

– రాస రాము, ఆర్మూర్ పట్టణం



ఏర్పాట్లు చేయాలి..

వేసవిలో ఎండ వేడిమిని లెక్క చేయకుండా పాదయాత్రగా కొండగట్టుకు వెలుతున్న భక్తులు మార్గమధ్యలో సేదతీరడానికి హిందూ భక్తులు ఏర్పాట్లు చేస్తే బాగుంటుంది. రానున్న రోజుల్లో పాదయాత్రగా అంజన్నను చేరుకొనే భక్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది.

– ఒడ్డన్న, నిజామాబాద్



హైదరాబాద్ నుంచి..

ఉద్యోగ రీత్యా హైదరాబాద్లో ఉన్నప్పటికీ హనుమాన్ జయంతి నాటికి మా స్వగ్రామమైన కమ్మర్పల్లికి చేరుకుంటాను. కమ్మర్పల్లి నుంచి కొండగట్టుకు పాదయాత్ర చేసుకొని స్వామి దర్శనం చేసుకొని తిరిగి విధుల్లోకి వెళ్లిపోతాను.

– గుండోజి నవతేజ్, కమ్మర్పల్లి



భక్తి పెరుగుతుంది..

సనాతన ధర్మాన్ని పాటిస్తూ ఆంజనేయ స్వామిని పూజిస్తున్నప్పటికీ దీక్షలో భాగంగా అడుగులో అడుగు వేస్తూ కాలినడకన కొండగట్టు అంజన్నను దర్శనం చేసుకోవడం మరింత భక్తి భావాన్ని పెంచుతుంది. చాలా చక్కటి అనుభూతిని మిగులుస్తుంది.

– రాకేష్, నిజామాబాద్



అద్భుత అనుభూతి

41 రోజుల పాటు దీక్షలో కొనసాగి పాదయాత్రగా కొండగట్టుకు వెళ్లి, స్వామిని దర్శించుకోవడం అద్భుతమైన అనుభూతిని కలిగిస్తుంది. ప్రతీ శనివారం జిల్లా కేంద్రం నుంచి సారంగపూర్ హనుమాన్ ఆలయానికి కాలినడకన వెళ్లి దర్శనం చేసుకోవడాన్ని కొనసాగిస్తున్నాను. – కాశ్డె సతీష్, నిజామాబాద్



బాల్కొండ మండలం నల్లూరు నుంచి పాదయాత్రగా వెళుతున్న మాలధారులు



అంజన్న కోసం..

చిన్నతనంలో నడవలేని స్థితిలో ఉన్న నన్ను మా కుటుంబ సభ్యులు ఒక ఆశ్రమంలో వదిలేసారు. ఆంజనేయ స్వామిపై ఉన్న భక్తి కారణంగా క్రమక్రమంగా నడక వచ్చింది. ఇప్పుడు ఐదు పదులు దాటిన వయస్సులో కొండగట్టు వరకు కాలినడకన వెళుతున్నాను.– విఠల్, నిజామాబాద్



అలుపెరగని ప్రయాణం

హనుమాన్ చాలీసా పారాయణతో పాదయాత్ర చేయడం అలుపెరగని ప్రయాణంగా కొనసాగుతుంది. ఇప్పటికే ఆరుసార్లు పాదయాత్రగా కొండగట్టు అంజన్నను దర్శించుకున్నాను. ఏడోసారి పాదయాత్రకు వెళ్లడం చాలా ఆనందంగా ఉంది.

– చిరుమల్ల పవన్, ఆర్మూర్



హనుమంతుడి సేవలో..

మా కుటుంబమంతా కొటార్మూర్లోని హనుమాన్ మందిరంలో పూజాకార్యక్రమాల్లో పాల్గొంటూ తరిస్తున్నాం. మాలధారణ చేసి మండల దీక్ష పూర్తి చేసుకొని కాలినడకన కొండగట్టుకు వెళ్లడం పదోసారి. ప్రతీఏటా ఇలాగే అంజన్న దర్శనం చేసుకోవాలని ఆశిస్తున్నాను.

– ప్రవీణ్, పెర్కిట్, ఆర్మూర్



ఆయనే నడిపిస్తాడు..

చిన్నతనం నుంచి కొండగట్టు అంజన్నపై భక్తితో పూజలు నిర్వహిస్తున్నాను. శరీరంలో ఉన్న నొప్పులను పట్టించుకోకుండా ఆంజనేయ స్వామిని తలుచుకుంటూ నడక సాగిస్తాను. ఆ పవన సుతుడే మా వెంట ఉండి పాదయాత్రను పూర్తిచేయించిన అనుభూతి కలుగుతుంది.

– వేల్పుల రణవీర్, ఆర్మూర్



మొదటి అడుగే మాది..

అంజన్నను చేరుకోవాలనే సంకల్పంతో మొదటి అడుగు మాత్రమే మేము వేస్తాము. చివరి వరకు మా పాదయాత్రకు ఆటంకం కలగకుండా కొండగట్టు వరకూ ఇక స్వామే నడిపిస్తాడు. హనుమాన్ భక్తులతో కలిసి నడక అలుపెరగని ప్రయాణంగా సాగుతుంది.

– కే.అజయ్ కిషోర్, పెర్కిట్



నాలుగేళ్ల కొడుకుతో..

మిత్రులతో కలిసి పాదయాత్రగా వెళ్లడం వల్ల అలసట సైతం లేకుండా ఉంటుంది. 4వ తరగతి చదువుతున్న నా కొడుకు సైతం కాలినడకన మాతో పాటు కొండగట్టు వరకు రావడం చాలా ఆనందాన్నిచ్చింది.

– హరి పవార్, ఆర్మూర్

కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రచారం చేయాలి

- జిల్లా వ్యాప్తంగా ప్రజలకు బీజేపీ నాయకులు వివరించాలి
- ఎంపీ అర్వింద్ ధర్మపురి

నిజామాబాద్ రూరల్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రవేశపెడుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలపై ఇంటింటా ప్రచారం చేయాలని ఎంపీ అర్వింద్ ధర్మపురి పేర్కొన్నారు. రూరల్ మండలంలోని మాధవనగర్ గ్రామంలో 'గావ్ చలో– బస్తీ చలో' కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రాష్ట్రానికి కేంద్రీయ విద్యాలయాలతోపాటు ఏడు నవోదయ పాఠశాలలు మంజూరు చేయించామని, అందులో రెండు నవోదయ పాఠశాలలు జిల్లాకు కేటాయించినట్లు తెలిపారు. పార్టీలకతీతంగా నవోదయ పాఠశాలల ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. రాష్ట్రంలో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, స్ట్రీట్ లైట్లు, రేషన్ బియ్యం పంపిణీ తదితర వాటిలో కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యం ఉందన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి, నాయకులు పద్మారెడ్డి, మాజీ కార్పొరేటర్ ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.



మాధవనగర్లో మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్, జిల్లా అధ్యక్షుడు కులాచారి దినేష్

వడగళ్ల వర్షం.. పంట నష్టం



ఎడపల్లి(బోధన్): ఎడపల్లి మండలంలోని జైతాపూర్ గ్రామంలో గురువారం రాత్రి వడగళ్ల వాన కురిసింది. అకాల వర్షంతో మండలంలోని ఆయా గ్రామాల్లో సుమారు 100 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు మండల వ్యవసాయ అధికారి సిద్ధి రామేశ్వర్ తెలిపారు. చేతికొచ్చిన పంట అకాల వర్షానికి దెబ్బతినడంతో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు.

పూలే జీవితాన్ని యువత స్ఫూర్తిగా తీసుకోవాలి



మాట్లాడుతున్న హైకోర్టు రిటైర్డ్ జడ్జి మాంధాత సీతారామమూర్తి



పాల్గొన్న తెయూ అధ్యాపకులు, విద్యార్థులు

తెయూ(డిచ్పల్లి): నేటి యువత మహాత్మా జ్యోతి బా పూలే జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని సమాజంలోని దురాచారాలను రూపుమాపడానికి కృషి చేయాలని హైకోర్టు రిటైర్డ్ జడ్జి మాంధాత సీతారామమూర్తి పిలుపునిచ్చారు. తెలంగాణ యూనివర్సిటీలో శుక్రవారం జ్యోతి బాపూలే జయంతి సందర్భంగా తెయూ బీసీ సెల్ డైరెక్టర్ సీహెచ్ ఆరతి అధ్యక్షతన 'భారతదేశ సామాజిక సమ్మిళిత అభివృద్ధిలో పూలే పాత్ర' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. పూలే 1873లో సత్యశోధక్ సమాజ్ స్థాపించి సమానత్వ సమాజం కోసం పోరాడారన్నారు. తెయూ రిజిస్ట్రార్ యాదగిరి మాట్లాడుతూ.. విశ్వవిద్యాలయాల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు చరిత్రను చదవడం కాదు.. చరిత్రను సృష్టించాలన్నారు. రిసోర్స్ పర్సన్ సీహెచ్ ఆంజనేయులు మాట్లాడుతూ.. భారతదేశంలో మహిళల విద్యకు అడ్డంకులను తొలగించడానికి పోరాడిన మహనీయుడన్నారు. పీఆర్వో పున్నయ్య, ప్రిన్సిపాల్ మామిడాల ప్రవీణ్, అధ్యాపకులు స్వప్న, నీలిమ ప్రసంగించారు. అనంతరం సీతారామమూర్తిని, రిజిస్ట్రార్ యాదగిరి, సదస్సు నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధ్యాపకులు, సిబ్బంది, పరిశోధక విద్యార్థులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్కంఠగా సాగిన బార్ అసోసియేషన్ ఎన్నికలు



ఖలీల్వాడి: నిజామాబాద్ బార్ అసోసియేషన్ ఎన్నికలు శుక్రవారం ఉత్కంఠ భరితంగా జరిగాయి. ఈ ఎన్నికల్లో 392 ఓట్లలో 322 ఓట్లు పోలయ్యాయి. ఉపాధ్యక్ష పదవికి పోటీ చేసిన దిలీప్, రెంజర్ల సురేష్లకు సమానంగా 157 ఓట్లు వచ్చాయి. ఇద్దరిని ఉపాధ్యక్షులుగా ఎన్నికల అధికారులు ప్రకటించారు. ప్రధాన కార్యదర్శిగా బట్టు మాణిక్ రాజు, సంయుక్త కార్యదర్శిగా ఝాన్సీరాణి గెలుపొందారు. నిజామాబాద్ బార్ అసోసియేషన్ పూర్తిస్థాయిలో ఆఫీస్ బేరర్స్, కార్యవర్గం ఏర్పడినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. అధ్యక్షుడిగా మామిల్ల సాయరెడ్డి ఎన్నికయ్యారని వివరించారు. కోశాధికారిగా నారాయణ దాసు, సాంస్కృతిక, క్రీడా కార్యదర్శిగా మంజిత్ సింగ్, లైబ్రరీ కార్యదర్శిగా శ్రీమాన్, మహిళ ప్రతినిధిగా రమాదేవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారన్నారు. కార్యవర్గ సభ్యులుగా మద్దెపల్లి శంకర్, భిక్షపతి, ఆయూబ్, మోబిన్, అరేటి నారాయణ, సయ్యద్ ఇంతియాజ్, సుజిత్ కుమార్, ప్రవీణ, వెంకటేష్, అఖిల ఏకగ్రీవంగా ఎన్నికయ్యారన్నారు. నూతన బార్ కార్యవర్గానికి న్యాయవాదులు శుభాకాంక్షలు తెలిపారు.

సెలవు రోజుల్లోనూ దరఖాస్తుల స్వీకరణ

నిజామాబాద్ సిటీ: రాజీవ్ యువ వికాసం పథకం కోసం దరఖాస్తుల సమర్పణకు ఇంకా మూడు రోజుల గడువే ఉంది. అయితే ఈనెల 12, 13, 14 రోజుల్లో ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు రోజులు. అయినప్పటికీ సెలవు రోజుల్లోనూ బల్దియా కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు టీపీఆర్వో చిదుర రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారులు ఈ విషయాన్ని గమనించి, దరఖాస్తులు కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. దరఖాస్తుల కోసం బల్దియా కార్యాలయంతోపాటు నగరంలోని 5 జోన్ కార్యాలయాల్లో కూడా దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు.

క్రైం కార్నర్

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

రెంజల్(బోధన్): మండలంలోని రౌడీషీటర్లకు శుక్రవారం రెంజల్ పోలీస్ స్టేషన్లో ఎస్సై చంద్రమోహన్ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. రౌడీషీట్ ఉన్న ప్రతీ ఒక్కరిపై నిఘా ఉంటుందన్నారు. మార్పు తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తామన్నారు. తీరు మారని పక్షంలో కఠిన చర్యలు ఉంటాయన్నారు. ఎలాంటి నేరాలకు పాల్పడకుండా సత్ప్రవర్తనతో ఉంటే ఎత్తివేసే ఆలోచన పోలీస్ కమిషనర్ చేస్తున్నారని వివరించారు. మండలంలోని 8 మంది రౌడీషీటర్ల నేరచరిత్ర, కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి కేసులకు పోకుండా జీవనోపాధి అవకాశాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు.

వేర్వేరు కారణాలతో ఇద్దరి ఆత్మహత్య

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని మాల్తుమ్మెద గ్రామంలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై మల్లారెడ్డి తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన మోరే రాజు(43)జనవరిలో తన పొలంలో రెండు బోర్లు వేయగా ఒక బోరులో మాత్రమే కొద్దిమేర నీరు వచ్చింది. బోరులో వచ్చిన నీరు సైతం యాసంగిలో పంటకు సరిపడక కొంతమేర పొలం సైతం ఎండిపోయింది. దీంతో బోర్లు వేసేందుకు తెచ్చిన అప్పులతోపాటు పంట పెట్టుబడికి అప్పులు తెచ్చాడు. వాటిని తీర్చే మార్గం లేకపోవడంతో జీవితంపై విరక్తి చెందాడు. ఈక్రమంలో గురువారం రాత్రి తన పొలంలో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య మంగమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బోధన్ మండలంలో..

బోధన్రూరల్: మండలంలోని పెగడపల్లి గ్రామంలో ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడినట్లు బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్రెడ్డి శుక్రవారం తెలిపారు. వివరాలు ఇలా.. పోతంగల్ మండలంలోని కారేగాం గ్రామానికి చెందిన ప్రేమలతకు కొన్నేళ్ల క్రితం పెగడపల్లికి చెందిన సాయిలుతో వివాహమైంది. కొంతకాలంగా ఆమెను బావ దేవయ్య, తోటి కోడలు పద్మ, మామ గంగారాం వేధింపులకు గురిచేస్తుండేవారు. గురువారం సాయంత్రం వేధింపులు భరించలేక ఆమె ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

క్రికెట్ బెట్టింగ్ నిర్వాహకుడి అరెస్ట్

బోధన్టౌన్(బోధన్): పట్టణంలోని బీటీ నగర్ కాలనీలో క్రికెట్ బెట్టింగ్ నిర్వాహకుడు షేక్ సయీద్ను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్కు తరలించారు. పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపిన వివరాలు ఇలా.. బీటీనగర్ కాలనీలో సయీద్ అనే యువకుడు ఆన్లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నాడన్న సమాచారం రావడంతో పోలీసులు అతడి ఇంటిపై దాడి చేశారు. సయీద్ను అదుపులోకి తీసుకొని విచారించగా నిజామాబాద్కు చెందిన ఐపీఎల్ బెట్టింగ్ నిర్వాహకులు ముజీబ్, సచిన్లను పరిచయం చేసుకొని బోధన్లో బెట్టింగ్ నిర్వహిస్తున్నాడన్నారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించ వచ్చని యువతకు మాయమాటలు చెప్పి వారితో ఆన్లైన్లో డబ్బులు వసూలు చేసి క్రికెట్ బెట్టింగ్ ఆడించేవాడన్నారు. అలా వచ్చిన డబ్బును ముజీబ్కు ఇవ్వగా, అతడు కమీషన్ ఇచ్చేవాడన్నారు. బెట్టింగ్ నిర్వాహకుడిని అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి సెల్ ఫోన్, బ్యాంక్ పాస్బుక్ సీజ్ చేశామని, కేసునమోదు చేసి రిమాండ్ తరలించినట్లు వెల్లడించారు.

కామారెడ్డిలో అగ్ని ప్రమాదం



కామారెడ్డి క్రైం: జిల్లాకేంద్రంలోని శ్రీరామ్నగర్ కాలనీలో గురువారం అర్ధరాత్రి ఓ ఇంట్లో అగ్ని ప్రమాదం జరిగింది. సుమారు అర్ధరాత్రి 2గంటల ప్రాంతంలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ఇంట్లో అద్దెకు ఉన్న మతిన్ కుటుంబసభ్యులు బయటకు పరుగులు తీశారు. వెంటనే స్థానికులు అప్రమత్తమై అగ్నిమాపక శాఖకు, పోలీసులకు సమాచారం అందించారు. ఫైర్ ఇంజిన్ ఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేసింది. ఇంట్లోని సామగ్రి, దుస్తులు పూర్తిగా కాలిపోయాయి. ఘటనపై అధికారులు విచారణ చేపట్టారు.

ముందస్తుగానే లారీలు


- ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద అందుబాటులో ఉంచుతున్న పౌర సరఫరాల శాఖ
- ధాన్యం బస్తాలను ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించడానికి ముమ్మర ఏర్పాట్లు



మోర్తాడ్ సొసైటీ వద్ద నిలిపి ఉన్న లారీలు

మోర్తాడ్: కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన ధాన్యంను మిల్లులకు తరలించడానికి అధికారులు ముందస్తుగానే లారీలను అందుబాటులో ఉంచుతున్నారు. గతంలో ధాన్యం తూకం వేసిన తర్వాత లారీలు రావాలంటే నాలుగైదు రోజుల సమయం పట్టేది. దీనివల్ల ధాన్యం మిల్లులకు సకాలంలో చేరకపోవడం, తూకం వేసిన ధాన్యం ఎండలో ఎండటం, లేదా అకాల వర్షాల వల్ల తడిసి ముద్దయ్యేది. ప్రస్తుతం వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ధాన్యంను తూకం వేసిన వెంటనే తరలించడానికి ముమ్మరంగా ఏర్పాట్లు చేయడం విశేషం. పౌర సరఫరాల శాఖ లారీల టెండర్లను పూర్తి చేయడంతోపాటు కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసే ధాన్యం లెక్కలను పరిగణలోకి తీసుకుని లారీలను అందుబాటులో ఉంచుతున్నారు. మోర్తాడ్ పరిధిలో ఇప్పటికే 25 లారీల ధాన్యంను మిల్లులకు తరలించారు. ఆరు ఖాళీ లారీలను కొనుగోలు కేంద్రాల వద్ద నిలిపి ఉంచారు. మిల్లుల్లోనూ అన్లోడింగ్ వేగంగా సాగంతో వాహనాలను వెంటవెంటనే కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్నారు. మోర్తాడ్, వడ్యాట్, దోన్పాల్, పాలెం, తిమ్మాపూర్ సహా పలు కేంద్రాల్లో తూకం వేసిన ధాన్యం ఎప్పటికప్పుడు తరలిస్తుండటంతో రైతులకు ఊరట లభిస్తుంది.

సాఫీగా ధాన్యం తరలింపు



గతంలో ధాన్యం తూకం వేసిన తర్వాత కొనుగోలు కేంద్రాల వద్దనే నాలుగైదు రోజుల పాటు నిలువలు ఉండేవి. ఇప్పుడు పౌర సరఫరాల శాఖ తీసుకున్న చర్యలతో లారీలు అందుబాటులో ఉంటున్నాయి. ఎలాంటి ఇబ్బంది లేకుండా ధాన్యం తరలింపు సాఫీగా సాగుతుంది.

– కుంట రవిశంకర్ రెడ్డి, రైతు, పాలెం

రైతులకు ఇబ్బంది లేకుండా చూస్తున్నాం...



ధాన్యం తరలించే విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తున్నాం. ధాన్యంను కొనుగోలు కేంద్రాల వద్ద అలాగే ఉంచితే అకాల వర్షాల వల్ల తడిసిపోయే అవకాశం ఉంది. నష్టం జరిగితే అందరికి ఇబ్బంది. ఇంతకుముందు లారీలు రావాలంటే నిరీక్షించాల్సి వచ్చేది. ఇప్పుడు లారీలను ముందస్తుగానే అందుబాటులో ఉంచుతున్నాం.

– బూత్పురం మహిపాల్, మార్కెట్ కమిటీ డైరెక్టర్, మోర్తాడ్